సాక్షి
తిరుపతి

బుధవారం । 15 । మే । 2024




ఓటోత్సాహం

తిరుపతి జిల్లాలో ఓటర్లు ఉత్సా హం గా తమ ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. జిల్లాలో 78.63 శాతం ఓట్లు పోలయ్యాయి. - 8లో



ఏనుగు ఆచూకీ కోసం గాలింపు

పాకాల మండలంలో హల్‌చల్ చేస్తున్న ఒం టరి ఏనుగు కోసం అటవీశాఖ అధికారులు గాలింపు చేపట్టారు. - 8లో



21 నుంచి బ్రహ్మోత్సవాలు

నారాయణవనంలోని కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు శ్రీగోవిందుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధ వారం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గం టల వరకు పుణ్యాహవచనం, మృత్సంగ్రహ ణం, సేనాధిపతి ఉత్సవం, శాస్త్రోక్తంగా అంకు రార్పణ చేపడతారు. కాగా 16వ తేదీ గురు వారం ఉదయం 8.15 నుంచి 8.40 గంటల మధ్య చేపట్టే ధ్వజారోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

నేడు శ్రీవారి హుండీ కానుకల లెక్కింపు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీన రసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయ స్వామి దేవస్థానాల్లోని హుండీ కానుకలను బుధవారం శ్రీవారి అలంకార మండపంలో లెక్కించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలి పారు. అలాగే గురువారం పెంచలకోన బ్రహ్మోత్సవాలపై నెల్లూరు జిల్లా ఆర్డీఓ, మం డల స్థాయి అధికారులతో సమావేశం నిర్వ హించనున్నట్లు అధికారులు తెలిపారు.

పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత యూనివర్సి టీలో 2024–25 విద్యాసంవత్సరానికి పీజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు రిజిస్ట్రార్ రమాశ్రీ తెలిపారు. ప్రధా నంగా ఆచార్య, ఎంఏ శబ్ద బోధ, ఎంఏ హిందీ, ఎమ్మెస్సీ యోగా థెరపీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులలో అడ్మిషన్లు పొందేందుకు ఆస క్తిగల అభ్యర్థులు జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ) ప్రవేశపరీక్ష పాసైన అభ్యర్థులు మాత్రమే పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా రెగ్యులర్ పద్ధతిలో ప్రాక్‌శాస్త్రి కోర్సులో ప్రవేశానికి ఆసక్తిగల అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హ తతో పాటు మరిన్ని వివరాలకు https://nsktu.ac.in వెబ్‌సైట్‌ను పరిశీలిం చాలని ఆమె కోరారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం గా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,815 మంది స్వామివారిని దర్శించుకోగా 25,245 మంది భక్తులు తలనీలాలు సమర్పిం చారు. స్వామివారికి కానుకల రూపంలో హుం డీలో రూ.3.16 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఓటేయని 'ఆరణి'

చిత్తూరు అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తన ఓటు హక్కు వినియోగించుకోవడంలో విఫ లమయ్యారు. చిత్తూరు నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలో ఆయన ఓటు వేయాల్సి ఉంది. అయితే పోలింగ్ రోజున ఆరణి ఓటేయలేదు.. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి వ్యక్తి ప్రజాప్రతినిధిగా సమాజానికి ఎలాంటి సందేశమిస్తారని పలువురు మండిప డుతున్నారు. ఓటేయని వ్యక్తి.. తనకు ఓటేసి గెలిపించాలని ఎలా కోరుతారని ఎద్దేవా చేస్తు న్నారు.

పచ్చమూకల స్వైరవిహారం

చంద్రబాబు పదవీ వ్యామోహం.. పలువు రిని గాయపరిచింది. ఆయన అధికార దాహం.. పలు చోట్ల హింసాత్మక ఘటన లకు దారితీసింది.. ఆయనలో తలెత్తిన ఓటమి భయం.. ప్రత్యర్థులపై దాడులకు పురిగొల్పింది. అధినేత కక్షపూరిత ప్రసం గాలు అనుయాయులను రెచ్చగొట్టాయి. ఈక్రమంలోనే పోలింగ్ రోజున ఓటరు నాడి పసిగట్టిన పచ్చమూకలు అల్లర్లకు దిగాయి. ఎక్కడికక్కడ 'ఫ్యాను' సానుభూ తిపరులపై దాడులకు పాల్పడ్డాయి. ఓటే యలేదని దళితులు.. ప్రజాదరణ పొందు తున్నారని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై సైతం దౌర్జన్యాలకు తెగబడ్డాయి. వ్యతిరేక పవనాలు వీస్తున్నాయనే అక్కసుతో పథకం ప్రకారం అడుగడుగునా అరాచ కాలు సృష్టించాయి.

- ఓటమి భయంతో దాడులకు దిగిన టీడీపీ నేతలు
- పథకం ప్రకారం పలు చోట్ల అల్లర్లు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపైనా దౌర్జన్యాలు
- అర్ధరాత్రి దళితుల ఇళ్లలోకి చొరబడి అరాచకాలు



చిత్తూరులో పోలీసులపై టీడీపీ అభ్యర్థి జగన్‌మోహన్ నాయుడు రుబాబు



చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో దొంగ ఓట్లు వేస్తున్న టీడీపీ శ్రేణులను అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చిత్తూరు అర్బన్: ఉమ్మడి జిల్లాలో మునుపెన్న డూలేని విధంగా ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్ని కల్లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకు న్నాయి. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపిన దళితులు, ఇతర వర్గాలపై టీడీపీ శ్రేణులు అక్కసు వెళ్లగ క్కాయి. ఓడిపోతున్నామనే భయం టీడీపీ నేతలకు నిద్రపట్టకుండా చేసింది. చిత్తూరు, తిరుపతి జిల్లా లోని పలు చోట్ల మంగళవారం తెల్లవారుజాము వరకు టీడీపీ నేతల అరాచకాలు కొనసాగాయి.

జీడీ నెల్లూరులో తమిళ రౌడీలు

ప్రశాంత వాతావరణానికి మారుపేరైన గంగాధరనె ల్లూరు నియోజకవర్గంలో ఈ పర్యాయం టీడీపీ తమ అభ్యర్థిగా వివాదస్పదుడైన థామస్‌ను బరి లోకి దింపింది. సామాజికవర్గం, విద్యార్హత, మతం , హత్యారోపణలు, విచ్చలవిడిగా నగదు పంపిణీ తదితర అపవాదులు మూటగట్టుకున్న థామస్.. పోలింగ్ వేళ నియోజకవర్గ ప్రజలను భయభ్రాం తులకు గురిచేశారు. ఓటుహక్కు లేనివాళ్ల జిల్లాలో ఉండొద్దని, తప్పనిసరైతే ఇళ్లలోనే ఉండాలని స్వయానా జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ ఆదేశాలను సైతం బేఖాతర్ చేశారు. తమిళనాడు నుంచి రౌడీలు, బౌన్సర్లను పెద్ద సంఖ్యలో జీడీనెల్లూరుకు తీసుకువచ్చారు. పోలింగ్ రోజున బూత్‌ల వద్ద తమిళ రౌడీలతో హల్‌చల్ చేశారు. ప్రశాంతంగా సాగుతున్న పోలింగ్‌ను ఉద్రిక్తంగా మార్చారు. జీడీ నెల్లూరులోని జంగాలపల్లెలో థామస్ వ్యక్తిగత కార్యదర్శి దాము ఏకంగా పోలిం గ్ కేంద్రంలోకి చొరబడి తలుపులు వేసుకుని రిగ్గిం గ్‌కు ప్రయత్నించాడు. ఇక ఎస్‌ఆర్ పురం మండలం లోని పుల్లూరుకు చెందిన దళితులు తమ పార్టీకి ఓటేయలేదనే సాకుతో సోమవారం రాత్రి కమ్మ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలు సుమారు 20 మంది దళితులను నిర్బంధించారు. అనంతరం పుల్లూరులోని దళితుల ఇళ్లలోకి చొరబడి విధ్వంస కాండకు పాల్పడ్డారు. మహిళలు, చిన్న పిల్లలు, వృ ద్ధులపై దాడులకు దిగారు. తన రెండు నెలల పాపతో నిద్రిస్తున్న ఓ బాలింతను కాలితో తన్ని, ఆమె మెడలోని మంగళసూత్రం సైతం లాక్కెళ్లిపో యారు. దొరికిన దళితులను దొరికినట్టుగా చిత కబాదారు. అర్ధరాత్రి రెండు గంటల వరకు ఈ దాడులు కొనసాగాయి.



చిల్లకూరు జెడ్పీ స్కూల్ వద్ద టీడీపీ శ్రేణుల వీరంగం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై దాడికి యత్నం

తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గ వైఎ స్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్‌పై టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడికి యత్నించాయి. చిల్లకూరు దర్గా సమీపంలోని ప్రాథమిక పాఠ శాల పోలింగ్ కేంద్రానికి వెళ్లిన మేరిగ మురళీధ రతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయ కుడు పట్టాభిరెడ్డి దురుసుగా ప్రవర్తించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అన్ని బూత్‌లు పరిశీ లించేందుకు హక్కు ఉందని చెబుతుండగానే మేరిగ మురళిని పక్కకు తోసేశారు. అదే సమ యంలో టీడీపీ కార్యకర్త సైతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపైకి రాయి విసిరాడు. శ్రీకాళహస్తిలో బొ జ్జల సుధీర్‌రెడ్డి రౌడీయిజం ప్రదర్శిస్తూ వైఎ స్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు యత్నిం చారు. అడ్డొచ్చిన పోలీసులకు, పోలింగ్ అధికా రులకు అంతు చూస్తామని వార్నింగ్ ఇచ్చారు. టీడీపీ నేతల గూండాయిజం ఈ ఎన్నికల్లో పోలింగ్‌రోజున అడుగడుగునా కనిపించింది.

చంద్రగిరిలో చిత్తూరు రౌడీయిజం

- వందలాది మంది టీడీపీ రౌడీల తిష్ట
- రెచ్చగొట్టి.. అల్లర్లు సృష్టించడమే పనిగే నాని అనుచరుల ఆగడాలు
- నామినేషన్స్ రోజున ఆర్డీఓ కార్యాలయం వద్ద దాడులు ప్లాన్‌లో భాగమే
- పోలింగ్ రోజున చంద్రగిరి నియోజకవర్గం లో విధ్వంసం వెనుక ఎన్నో అనుమానాలు

సాక్షి, తిరుపతి: ఓటమి భయంతో కూటమి అభ్య ర్థులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓట ర్లను భయభ్రాంతులకు గురిచేసి పోలింగ్ శాతాన్ని తగ్గించాలని పక్కా ప్లాన్‌తో విధ్వంసాలు సృష్టించారు.

అల్లర్లు సృష్టించి..అసత్యాలకు పదును పెట్టి

ఎన్నికల్లో అల్లర్లు, విధ్వంసాలు సృష్టించేందుకు కూటమి అభ్యర్థులు నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే విధ్వంసాలకు పథక రచన చేశారు. అందులో భాగంగానే నామినేషన్ రోజున ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే చెవి రెడ్డి భాస్కర్‌రెడ్డి వాహనంపై దాడికి తెగబడ్డారు. ఆపై విచక్షణారహితంగా పోలీసులపైన, వైఎస్సా ర్‌సీపీ శ్రేణులపై రాళ్ల వర్షం కురిపించారు. మరోవైపు తిరుపతి నగరంలో జరుగుతున్న ప్రచా రంలో జనసేన రౌడీలు స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపైన దాడులకు తెగబడ్డారు. ఇదంతా కుట్రలో భాగమేనని ఓటర్లు చర్చించుకుంటు న్నారు.

రిగ్గింగ్‌ని అడ్డుకున్నందుకే విధ్వంసాలు

పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గ ఓటర్లం తా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికే పట్టం కడుతున్నారన్న విషయాన్ని గ్రహించిన కూటమి అభ్యర్థి పులివర్తి నాని అనుచ రులు రామచంద్రాపురం మండలం, బ్రాహ్మణకా లువ పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్‌కు యత్నిం చారు. తమకు అడ్డుగా ఉన్న దళిత ఏజెంట్‌ని బయటకు లాక్కొచ్చి అతనిపై దాడిచేశారు. వైఎస్సార్‌సీపీ పాకాల మండల పార్టీ అధ్యక్షులు నంగా నరేష్‌రెడ్డి కుమారుడు లవంత్‌రెడ్డిపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. తర్వాత పులివ ర్తివారి పల్లెలో రిగ్గింగ్‌కు యత్నించారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్‌పై మాజీ జెడ్పీటీసీ సురేష్‌చౌద రి, పులివర్తి నాని కుమారుడు వినీల్ దాడికి దిగారు. నారావారిపల్లె పరిధిలోని పోలింగ్ కేంద్రంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్ పైనా టీడీపీ మూకలు దాడిచేశారు. అదేవిధంగా కూచువారిపల్లె పరిధిలోని పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్‌కి అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్ రాజశేఖర్‌ని, రిలీవ్ ఏజెంట్‌గా ఉన్న సర్పంచ్ కొట్టాల చంద్రశేఖ ర్‌రెడ్డిపై దాడి చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి ఇం టిని ధ్వంసం చేశారు. గ్రామానికి చేరుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై దౌర్జన్యానికి దిగారు. మోహిత్‌రెడ్డి వాహనానికి నిప్పు పెట్టి, మరో ఎస్కార్ట్ వాహనాన్ని ధ్వంసం చేశారు. కార్యకర్తలపై దౌర్జన్యం చేశారు. కూచువారిపల్లెలో కార్యకర్తలను బేడ్లతో కోసి రక్త గాయాలు చేశారు.



మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూం సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కారును ధ్వంసం చేసిన అల్లరిమూకలు



తిరుమల నగర్ పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మొదలియార్ రమేష్‌పై దాడి చేస్తున్న టీడీపీ గూండాలు

అక్కడే ఎందుకు తిష్ట?

పోలింగ్ రోజున ఎటూ ఓటింగ్ శాతాన్ని తగ్గించలేకపోయామని భావించిన కూటమి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు రెచ్చిపోతున్నారు. మహిళా విశ్వవిద్యాలయం ప్రాంతంలో 144 సెక్షన్ అమలులో ఉండగా స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పులివర్తి నాని అనుచరులు మారణాయుధాలతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిధిలో ఉన్న రౌడీ మూకలు మహిళా యూనివర్సిటీ సమీపంలో వైఎస్సార్ సీపీ స్టిక్కర్‌తో ఉన్న ద్విచక్ర వాహనాన్ని కిందప డేసి ధ్వంసం చేశారు. ఆపై దానికి నిప్పంటిం చారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకుడికి కారును కూడా ధ్వంసం చేశారు.



వీరంగం సృష్టిస్తున్న టీడీపీ గూండాలు



ధ్వంసమైన పోలీసు వాహనం

తిరుపతిలో జాతర డప్పు దరువు!

తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర ప్రారంభం

- అర్ధరాత్రి నగర పొలిమేరల్లో కైకాల చాటింపు
- అమ్మవారి కొడిస్తంభానికి అభిషేకం, ఒడిబాల సమర్పణ
- ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి దర్శనం

తిరుపతి కల్చరల్: 'ఇందుమూలంగా యావన్మం దికి తెలియజేయడం ఏమనగా.. చాటింపుతో నేటి నుంచి తిరుపతి గంగజాతర ప్రారంభమైంది.. వారం రోజుల పాటు తిరుపతిలో గంగజాతర కొన సాగుతుంది.. కనుక నగరవాసులెవ్వరూ ఊరు వదలి వెళ్లరాదు.. ఇంతర ప్రాంతాల నుంచి వచ్చే వారు రాత్రి పూట ఇక్కడ బస చేయకుండా తిరిగి వెళ్లిపోవాలి.. జాతర ప్రారంభమైనందున అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వ హించుకోవాలహో...' అంటూ మంగళవారం కై కాల వంశస్థులు తిరుపతి గంగజాతర చాటింపు వేశారు. భేరివీధిలో తొలి చాటింపు పూజ నిర్వహిం చారు. అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్ పోస్టాఫీస్, కృష్ణా పురం ఠాణా, పాత మెటర్నటీ ఆస్పత్రి సర్కిల్ ప్రాం తాల్లో అర్ధరాత్రి అష్టదిగ్బంధన చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఆ చాటింపుతో తిరుపతి శ్రీతాతయ్యగుంట చిన్నగంగమ్మ(తిరుపతి గ్రామదేవత) జాతర అత్యంత వేడుకగా ఆరంభ మైంది.

ఒడిబాలు సమర్పణ

భక్తకోటి కోర్కెలు తీర్చే కల్పవల్లి, తిరుపతి గ్రామదే వత శ్రీతాతయ్యగుంట గంగ జాతర బుధవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనుంది. జాతర సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఇం దులో భాగంగా ఉదయం 8గంటలకు ఆలయ అవ రణలోనున్న అమ్మవారి విశ్వరూప కొడిస్తంభానికి అర్చకులు శాస్త్రోక్తంగా అభిషేకం, పూజలు చేసి, ఒడిబాలు సమర్పించారు. అలాగే ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్వాంగ సుందర అలంక రణలో అమ్మవారు వజ్రకిరీటం, బంగారు ముఖ కవచం ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. జాతర ప్రారంభం సందర్భంగా విశేష సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వెయ్యి కళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు తీర్చుకున్నారు. మేయర్ డాక్టర్ శిరీష ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.మమత, అర్చకులు రామకృష్ణశర్మ, మురళీస్వామి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీతాతయ్యగుంట గంగమ్మ



కొడిస్తభానికి ఒడిబాల సమర్పణ అనంతరం హారతి ఇస్తున్న అర్చకులు

నేడు బైరాగి వేషం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి వారం రోజుల జాతర ఉత్సవాలు విభిన్న వేషాలతో కోలాహలం ఆరంభమవుతుంది. నాడు పాలేగాన్ని సంహరించే దశలో గంగమ్మ రోజుకొక వేషం వేసి చివరి రోజు దొరవేషంలో పాలేగాన్ని సంహరిస్తుంది. ఇందుకు సూచికగా ఏడు రోజుల పాటు సంప్రదాయ బద్ధం గా కైకాల వంశీయులు, భక్తులు రోజుకొక వేషం ధరించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా తొలి రోజు బుధవారం బైరాగి వేషంతో జాతర ఆరంభం కానుంది.

గంగమ్మ నామావళి సీడీ ఆవిష్కరణ

తిరుపతి మంగళం : తిరుపతిలో కొలువై రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన తిరుపతి తాతయ్య గుంట గంగ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించుకుందాని తిరుపతి ఎమ్మెల్యే భూమ కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మా వతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళ వారం తాతయ్యగుంట గంగమ్మ తల్లి నామావళి సీడీని ఆయన ఆవిష్కరించారు. వర్ష మ్యూజిక్ అకాడమీ సమర్పణలో డాక్టర్ విజయలక్ష్మి రచిం చి, కోనేరు లక్ష్మిరాజ్యంతో కలిసి గానం చేయగా, ఆర్ కళ్యాణ్‌కుమార్ సంగీతం సమ కూర్చారు. గత ఏడాది సినీ గాయకురాలు మం గ్లీతో పాటు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ఆలపిం చిన గంగమ్మ పాటలకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తిం పు వచ్చాయి. ఈ ఏడాది కూడా గంగమ్మ పాటలు భక్తులను అలరించేలా రూపొందించి నట్లు తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తొండమల్ల పుల్లయ్య పాల్గొన్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

జూన్ 1 నుంచి కొత్త భవనంలో జిల్లా కోర్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని హైరోడ్డులో నిర్మించిన నూతన కోర్టు కాంప్లెక్స్‌లో జూన్ 1వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో పరిపాలన కొనసాగించను న్నారు. దాదాపు రూ.42 కోట్ల వ్యయంతో 15 న్యాయస్థానాలు ఒకే భవనంలో ఉండేలా నిర్మించిన సముదాయాన్ని సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇటీవలే ప్రారంభించారు. ఈనెల 29 నుంచి 31వ తేదీలోపు నగరంలోని ఎస్టేట్‌లో ఉన్న న్యాయస్థానాల కేసు రికార్డులను, కొత్త భవనంలోకి తరలించాలని జిల్లా జడ్జి భీమారావు అధికారులను ఆదేశించారు.

టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

చిత్తూరు రూరల్(కాణిపాకం): మండలంలోని పెరు మాళ్లకండ్రిగ గ్రామంలో సోమవారం రాత్రి వైఎ స్సార్‌సీపీ నాయకులపై దాడి చేసిన 15 మంది టీడీపీ నేతలపై బీఎన్‌ఆర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించారని బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు తులసీపతి నాయుడు, రవికుమార్, సుధీర్, సురేష్, గణేష్ లతో పాటు 10మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కిం ద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపారు. అలాగే టీడీపీ నేతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, శిరీష, అమర్‌నాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, కృష్ణ మూర్తి, వేలుస్వామిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని శవం లభ్యం



నాగలాపురం: మండలంలోని అలపగుంట గ్రామానికి వెళ్లే దారిలో కడివేడు బండి బాట వద్ద మంగళవారం మధ్యాహ్నం ఓ గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని శవంగా నిర్ధారించారు. ఎవరైనా తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ ఓబయ్య సూచించారు.

ఉరి వేసుకుని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తడ: ఆరు పదుల జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని నిలబడ్డ ఆ వ్యక్తికి తన శక్తికి మించిన కష్టం ఏమొచ్చిందో తెలియదుగానీ లుంగీ గుడ్డతో ఓ చెట్టుకు ఉరివేసుకుని తనువు చాలించాడు. ఎస్‌ఐ పీ నరశింహారావు కథనం.. మంగళవారం తెల్లవారుజామున తడ మండలం, తడకండ్రిగ కారు స్టాండు వద్ద ఉన్న చెట్టుకు గుర్తుతెలియని వృద్ధుడు ఉరివేసుకున్నట్టు సమాచారం అందడంతో సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ సుమారు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వృద్ధుడు లుంగీ చింపి చెట్టుకు ఉరి వేసుకుని తనువుచాలించి ఉన్నాడు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దింపి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు నల్లటి ప్యాంటు, ఎర్రటి మొలతాడు ధరించి ఉండగా పొడవు చేతుల తెల్ల షర్టును తీసి పక్కన ఉంచాడు. షర్టు వద్ద గొలగమూడి వెంకయ్యస్వామి గుడి వద్ద ఇచ్చే అన్నదానం టికెట్టు తప్ప మరెలాంటి ఆధారాలు లభించలేదని ఎస్‌ఐ తెలిపారు.

నాంచారమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో పగులగొట్టిన హుండీ

దక్కిలి: మండలంలోని కుప్పాయి పాళెం గ్రామ దేవత నాంచారమ్మతల్లి ఆలయంలో సోమవారం రాత్రి గర్తు తెలియన వ్యక్తులు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం.. నాంచారమ్మతల్లికి భక్తులు భక్తి భావంతో హుండీలో కానుకలు వేయడం అనవాయితీగా వస్తోంది. అయితే సోమవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని పగులగొట్టారు. అందులోని సుమారు రూ.20వేల నగదు, అమ్మవారి 9 కేజీల విలువజేసే త్రిశూలాన్ని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు దక్కిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి బీసీ కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు అందించిన వివరాలు.. తిరుపతికి చెందిన వెంకటేష్(21), మోహన్‌రాజ్(23) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ఇసుకతాగేలి బీసీ కాలనీకి సమీపంలో ముందువెళుతున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఓటోత్సాహం



ఈవీఎంలను శ్రీపద్మావతి స్ట్రాంగ్ రూమ్‌లోకి తీసుకెళ్తున్న సిబ్బంది



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, పలువురు అధికారులు

- జిల్లాలో 78.63 శాతం పోలింగ్
- స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు
- శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి తరలింపు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ఎట్టకేలకు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 78.63 శాతం ఓట్లు పోలైనట్టు మంగళవారం ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది జిల్లాలో78.02 శాతం ఓట్లు పోలైనట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. మొత్తంగా జిల్లాలో స్వల్పంగా మాత్రమే ఓటింగ్ శాతం పెరిగింది. అత్యధికంగా సత్యవేడులో 85.28శాతం ఓట్లు పోలవగా.. తిరుపతిలో 63.32 శాతం ఓట్లు నమోదయ్యాయి. తిరుపతి పార్లమెంట్‌కు 65.54 శాతం ఓట్లు పోలయ్యాయి.

కౌంటింగ్‌కు పద్బందీగా ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీ లెక్కించనున్నారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. అభ్యర్థులు ఎవరికి వారు విజయావకాశాలపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
గూడూరు	2,45,205	1,93,430	78.89
సూళ్లూరుపేట	2,42,610	2,01179	82.92
వెంకటగిరి	2,43,582	1,96,986	80.87
చంద్రగిరి	3,15,159	2,51,788	79.89
తిరుపతి	3,02,503	1,91,557	63.32
శ్రీకాళహస్తి	2,48,536	2,06,914	83.25
సత్యవేడు	2,15,385	1,83,686	85.28
మొత్తం	18,12,980	14,25,540	78.63

తిరుపతి పార్లమెంట్‌కు 79.1శాతం పోలింగ్

తిరుపతి పార్లమెంట్ పరిధిలో 79.1శాతం ఓట్లు పోలింగ్ అయినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా చూస్తే గత పార్లమెంట్ ఉప ఎన్నికల్లో 82.34 శాతం ఓట్లు పోలైనట్టు వారు వెల్లడించారు.

కట్టుదిట్టమైన భద్రత

ఈవీఎంలను శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచాం. ఈ క్రమంలో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ఉజ్వలకుమార్ ఘోష్, సాధారణ ఎన్నికల పోలీస్ పరిశీలకులు అరవింద్ ఘోష్‌తో కలిసి భద్రతా పరమైన అంశాలను పర్యవేక్షిస్తున్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ చేపట్టనున్నాం. అప్పటి వరకు పటిష్టమైన బందోబస్తు కల్పిస్తున్నాం.



స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచిన ఈవీఎంలు

-ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎన్నికల అధికారి

ఏనుగు ఆచూకీ కోసం గాలింపు

పాకాల: మండలంలో గత రెండు రోజుల నుంచి హల్‌చల్ చేస్తున్న ఒంటరి ఏనుగు ఆచూకీ కోసం సుమారు 30 మంది సిబ్బందితో అటవీశాఖ అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇరంగారిపల్లి, కంపార్ట్మెంట్–102, పాకాల ఆర్ ఎఫ్, బాగిరాగన్నచెరువు గ్రామం వద్ద చొప్పవాని చెరువు వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడి నుంచి శ్రీరామాపురం వద్ద ఏనుగు తిరిగిన ఆనవాళ్లు కనిపించాయని సమాచారం అందడంతో అక్కడ కూడా గాలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అటవీ సమీప గ్రామాల ప్రజలు రాత్రి పూట బయట నిద్రించరాదని అధికారులు సూచించారు. ఇదిలావుండగా సోమవారం రాత్రి ముద్దలపల్లికి చెందిన ఓ రైతు పొలంలోని అరటి తోటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది.

వ్యక్తిపై దాడి

చిల్లకూరు: తీర ప్రాంతంలోని చింతవరం గ్రామంలో మంగళవారం ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడి చేయడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం.. చింతవరం గ్రామానికి చెందిన జాలాది గోపాల్ అదే గ్రామంలో రైతు డిపో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం జరిగిన ఎన్నికలలో స్థానిక పోలింగ్ కేంద్రం వద్ద చింతవరం కొత్తపాళెం గ్రామానికి చెందిన యువకులతో కొంత వివాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత మంగళవారం ఉదయం గోపాల్ రైతు డిపో తెరుచుకునే సమయంలో చింతవరం కొత్తపాళెం గ్రామానికి చెందిన దిలీప్, చెంచయ్య, కాంత్రి అక్కడికి చేరుకుని అతనితో గొడవపడ్డారు. ఆ తర్వాత అక్కడ ఉన్న రాడ్డుతో అతని తలపై మోదడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత యువకులు అక్కడి నుంచి పారిపోయారు. విషయం గమనించిన స్థానికులు అతనిని నెల్లూరులోని ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

గుడిపాల: మండలంలోని నరహరిపేట చెక్ పోస్టు సమీపంలో ఓ యువకుడు మంగళవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కుప్పిగానిపల్లెకు చెందిన ఏసు కుమారుడు విజయ్(24) పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో విజయ్ ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు.

స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత



స్ట్రాంగ్‌లో ఈవీఎంలను ఉంచి, సీల్ వేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన అధికారులు, పరిశీలకులతోపాటు వివిధ పార్టీల నేతలతో కలసి ఈవీఎంల స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోల్ అయిన ఈవీఎంలను, సంబంధిత సామగ్రిని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్టు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, అబ్జర్వర్ల సమక్షంలో ఈవీఎంలను ఇంటీరిం స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్టు వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్‌ఘోష్, కైలాస్ వాంఖడే, కే. జ్యోతి, జిల్లా సాధారణ ఎన్నికల పోలీస్ పరిశీలకులు అరవింద్ సాల్వే, రిటర్నింగ్ అధికారుల, రాజకీయ పార్టీల అభ్యర్థుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేసి స్ట్రాంగ్ రూమ్‌లకు తాళాలు వేసినట్టు వెల్లడించారు. అందులోని ఈవీఎం లను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు టీవీ స్క్రీన్ పై భద్రతా సిబ్బంది పరిశీలించే విధంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రోజూ దీన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీలో పరిశీలించవచ్చని, త్రీ లేయర్ సెక్యూరిటీ ఏర్పాటుతో సీఏపీఎఫ్ కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ బలగాలు, రాష్ట్ర పోలీసులు భద్రత కల్పిస్తున్నారని చెప్పారు. ఈవీఎంల భద్రతపై ఎలాంటి అనుమానాలకు తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పోలీస్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: రాష్ట్రమంతా ఫ్యాన్ ప్రభంజనం సృష్టించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం చిల్లకూరులోని కామిరెడ్డి నివాసం వద్ద 13గ్రామ సచివాలయ పరిధిలోని 216 మంది మాజీ వలంటీర్లను ప్రత్యేకంగా సన్మానించి సొంత నిధుల నుంచి నెల జీతాన్ని అందజేశారు. ఆయన మట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర ప్రజలందరూ మంచి చేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా కోరుకోవడం వల్ల అన్నీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ భారీ ఆధిక్యంతో గెలుస్తుందన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా సుపరిపాలన అందించిన జననేత జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వలంటీర్లు అందరూ మళ్లీ బాధ్యతలు తీసుకుని అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందిస్తారని పేర్కొన్నారు. పేదలకు సేవ చేసిన వలంటీర్లకు మంచి రోజులు కచ్చితంగా ఉంటాయన్నారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వెంకటరత్నం, నాయకులు హరిబాబురెడ్డి, రమణారెడ్డి, రఘునాయుడు, లింగమనాయుడు, వినోద్‌రెడ్డి, చెంగయ్య, బాలు, మోహన్, బాలసుబ్రమణ్యం, గురవయ్య పాల్గొన్నారు.

19న నీలం సంజీవరెడ్డి జయంతి

- 111వ జయంతి వేడుకలు
- డీఆర్‌డీఏ సమావేశపు హాల్‌లో కార్యక్రమం
- అగ్రశ్రీ నేతృత్వంలో ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ) ఆధ్వర్యంలో మే 19న భారత 6వ రాష్ట్రపతి, యునైటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 111వ జయంతి వేడుకల సందర్భంగా తిరుపతిలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ‘మానవ హక్కులు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21’ అనే అంశంపై 2వ నీలం సంజీవరెడ్డి స్మారక ఉపన్యాసం, నీలం సంజీవరెడ్డి రాష్ట్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ డి.సుందరరామ్ మంగళవారం ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ మరియు అగ్రశ్రీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సుభాష్ సి.కశ్యప్ అధ్యక్షతన నీలం సంజీవరెడ్డి రాష్ట్ర అవార్డుల జ్యూరీ 2024 సంవత్సరానికిగానూ జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్, ఏపీ హైకోర్టు మాజీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, అమరావతి (విశిష్ట రత్న), ప్రొఫెసర్ ఎ.లక్ష్మీనాథ్, వైస్–ఛాన్సలర్, మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ, ఔరంగాబాద్ (న్యాయ శిరోమణి), ప్రొఫెసర్ పి.మురళి, మాజీ వైస్ ఛాన్సలర్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (విద్యా శిరోమణి), ప్రొఫెసర్ జి.సుబ్రమణ్యం, మాజీ డైరెక్టర్–కమ్–వైస్–ఛాన్సలర్, స్విమ్స్, జె.మురళి, ఐఏఎస్ (రిటైర్డ్), డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఐదుగురు ప్రముఖులకు పురస్కారాలను బహూకరిస్తున్నట్లు జ్యూరీ కన్వీనర్ డాక్టర్ సుందరరామ్ పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నీలం సంజీవరెడ్డి రాష్ట్ర అవార్డుల గ్రహీతల గౌరవార్థం అగ్రశ్రీ ప్రత్యేక సావనీర్‌ను విడుదల చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ జి.ఎత్తిరాజులు అధ్యక్షత వహిస్తారని డాక్టర్ సుందర్‌రామ్ వివరించారు.

వెకేషన్ కోర్టు షెడ్యూల్ విడుదల



ఏ.నరసింహమూర్తి, జడ్జి

తిరుపతి లీగల్: జిల్లా జడ్జి కోర్టులకు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు ఈనెల 14 నుంచి వేసవి సెలవులు ప్రారంభం కావడంతో అత్యవసర కేసులను దాఖలు చేసి ఉత్తర్వులు పొందడానికి రాష్ట్ర హైకోర్టు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెకేషన్ కోర్టులను ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల విచారణ ప్రత్యేక సెషన్స్ కోర్టు జడ్జి, మొదటి విడత వెకేషన్ కోర్టు జడ్జి ఏ.నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ఈనెల 14 నుంచి 29వ తేదీ వరకు మొదటి విడతగా, ఈ నెల 30 నుంచి జూన్ 14వ తేదీ వరకు రెండో విడతగా విభజిస్తూ ఉత్తర్వులు జారీచేసిందన్నారు. మొదటి విడత వెకేషన్ కోర్టు తిరుపతిలో ఈ నెల 14, 21, 28 తేదీల్లోనూ, చిత్తూరులో ఈ నెల 15, 22, 29 తేదీల్లోనూ, శ్రీకాళహస్తిలో ఈ నెల 16, 23 తేదీల్లోనూ, మదనపల్లిలో ఈ నెల 17, 24 తేదీల్లోనూ, పీలేరులో ఈ నెల 20, 27 తేదీల్లో విధులు నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు.

రెండో విడత

రెండో విడత వెకేషన్ కోర్టు షెడ్యూలు ఈ నెల 30 నుంచి జూన్ 14 వరకు విభజిస్తూ శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్జి, రెండో విడత వెకేషన్ కోర్టు జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాళహస్తిలో ఈ నెల 30, జూన్ 6, 13 తేదీల్లోనూ, చిత్తూరులో ఈ నెల 31, జూన్ 7, 14తేదీల్లోనూ, తిరుపతిలో జూన్ 3, 10 తేదీల్లోనూ, మదనపల్లిలో జూన్ 4, 11 తేదీల్లోనూ, పీలేరులో జూన్ 5, 12 తేదీల్లోనూ వెకేషన్ కోర్టు విధులు నిర్వహించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోర్టులకు సెలవులు

ఈ నెల 13 నుంచి జూన్ 14వ తేదీ వరకు జిల్లా కోర్టులకు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు వేసవి సెలవులను రాష్ట్ర హైకోర్టు ప్రకటించింది. అలాగే ఈ నెల 20 నుంచి జూన్ 14వ తేదీ వరకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు వేసవి సెలవులను ప్రకటిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. సెలవుపై వెళ్లడానికి జిల్లా, సీనియర్ సివిల్ జడ్జీలకు 14 రోజుల పాటు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కక్ష గట్టి మట్టుబెట్టే కుట్ర



టీడీపీ వర్గీయుల దాడిలో తీవ్రంగా గాయపడిన మణి, లూథియా, రంగయ్య

నాయుడుపేటటౌన్: టీడీపీ వర్గీయులు గ్రామాల్లో రెచ్చగొట్టే ధోరణి అవలంభిస్తున్నారు. తమకు ఓటు వేయలేదన్న అక్కసుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతున్నారు. ఇలాంటి ఘటనే మండల పరిధిలోని మాబాక గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బత్తల రంగయ్య కుటుంబం వైఎస్సార్‌సీపీకి పనిచేస్తోందన్న అక్కసుతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు కక్షగట్టారు. విచక్షణ రహితంగా దాడికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం .. మాబాక గ్రామానికి చెందిన బత్తల రంగయ్య కుమారుడు ప్రతాప్ కొద్ది రోజుల కిందట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో కక్ష గట్టిన మాబాక గ్రామానికి చెందిన టీడీపీ నేతలు అదే గ్రామానికి చెందిన విజయ్, ప్రదీప్, శీనులను రెచ్చగొట్టి మంగళవారం ఉదయం గ్రామంలో ఉన్న బత్తల ప్రతాప్‌పై దాడికి ఉసిగొల్పారు. ప్రతాప్‌ను పట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రచారానికి తిరుగుతావా..? అంటూ చావబాదారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై కక్షగట్టి మరోమారు విజయ్, ప్రదీప్, శీనులు భీమవరం గ్రామంలో ఉన్న టీడీపీ వర్గీయులైన నెలవల గోపితో పాటు మరో 10 మందికి పైగా మంగళవారం సాయంత్రం మాబాక గ్రామానికి వచ్చి ప్రతాప్ ఇంటిపై దాడి చేశారు. తమ వెంట తెచ్చుకున్న కత్తితో మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన ప్రతాప్ అక్క లూథియాపై కూడా దాడిచేశారు. అలాగే మేనమామ మణి తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. అంతే కాకుండా వృద్ధుడైన ప్రతాప్ తండ్రి రంగయ్య కాళ్లుచేతులతో విచాక్షణ రహితంగా కొట్టి గాయపరిచారు. అనంతరం టీటీపీ వర్గీయుల దాడి దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సీఐ శ్రీనివాసరెడ్డికి చూపించారు.

వలంటీరుపై దాడి

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరుకు చెందిన గ్రామ వలంటీర్ కళత్తూరు మాలతిపై అదే ప్రాంతానికి చెందిన ఆరుగురు దాడి చేయడంతో బాధితురాలు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. మాలతీ గత ఐదేళ్లగా గ్రామంలో వలంటీరుగా పని చేస్తూ ఇటీవల రాజీనామా చేసింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచింది. దీన్ని సహించలేని అదే ప్రాంతానికి చెందిన అరుణ్, అర్జున్, సెల్వ, శ్రావణి, జ్యోతి, షఫ్రీన్‌లు కలిసి ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేపడతామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

21 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: నారాయణవనంలోని పద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం చేపట్టే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం ఊంజల్ సేవ, తిరిగి రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు స్వామివారి వాహన సేవలు జరగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో రోజూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పద్మావతీ సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు 21న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహనం, 22న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 23న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం, 24న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనంపై స్వామి వారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. 25వ తేదీ ఉదయం పల్లకీ సేవ, రాత్రి గరుడ వాహన సేవ నిర్వహించనున్నారు. 26న హనుమంత వాహనం, సాయంత్రం వసంతోత్సవం, రాత్రి గజ వాహనం, 27న సూర్య ప్రభ, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహించనున్నారు. 28న ఉదయం రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవ, 29న ఉదయం పద్మ సరస్సులో చక్రస్నానం, రాత్రి చేపట్టే ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విశ్వం సంచలనం



ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (ఏపీఆర్‌జేసీ)లలో ప్రవేశాలకు గత నెల 25వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు మంగళవారం వెల్లడయ్యాయి. ఈ ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు వివిధ విభాగాల్లో పదిలోపు 9 ర్యాంకులను సాధించి సంచలన విజయం నమోదు చేశారని ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో పీ.హేమశ్రీ, కే.నిత్యశ్రీ కల్యాణి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు, ఓ.ధీరజ్ ద్వితీయ ర్యాంకు, పీ.మేఘన, ఆర్.మహితలు తృతీయ ర్యాంకు, కే.చరిత నాల్గో ర్యాంకు, ఆర్.రెడ్డిచరణ్‌రెడ్డి 5వ ర్యాంకు, సీ.లేఖన 6వ ర్యాంకు, డీ.నవదీప్ 7వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. పోటీ పరీక్ష లేదైనా తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తుండడం తాము అనుసరిస్తున్న విద్యాప్రమాణాలకు నిదర్శనమన్నారు. అనంతరం ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథరెడ్డి అభినందించారు.

నాదస్వర విద్వాంసునికి ఏ టాప్ గ్రేడ్



ఆలిండియా రేడియో కేంద్రం డైరెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుధాకర్

చిల్లకూరు: ఆలిండియా రేడియో విజయవాడ స్టేషన్‌లో పనిచేస్తున్న నాదస్వర విద్వాంసునికి ఏ టాప్ గ్రేడ్‌ను మంగళవారం రేడియో స్టేషన్లో అందించినట్లు నాదస్వర విద్వాంసుడు సుధాకర్ తెలిపారు. మండల తీర ప్రాంతంలోని వరగలి గ్రామానికి చెందిన రాజమహేంద్రవరం సుదాకర్ చిన్నతనం నుంచి నాదస్వరం నేర్చుకుని మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలోనే అతనికి ఆలిండియా రేడియో కేంద్రంలో నాద్వసర విద్వాంసుడిగా అవకాశం లభించింది. ఇందులో భాగంగా అతనికి ఇప్పటికే కేంద్రం బీ– టూ, ఏ గ్రేడ్‌లు ప్రదానం చేయగా ఇటీవల చేసిన పలు కార్యక్రమాల ద్వారా మంచి గుర్తింపు రావడంతో ఇప్పుడు రేడియో కేంద్రం డైరెక్టర్ బీ.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఏ టాప్ గ్రేడ్ అవార్డు వరించింది. ఈ మేరకు ఆయన్ను వరగలి గ్రామ ప్రజలు అభినందనలతో ముంచెత్తారు.